APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 08, జూలై 2026 సంపుటి: 01 సంచిక :42 పేజీలు : 04 వెల: 2-00/-



## మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

- బింటాంగ్ ఆదిపూర్ణ స్వీకరణ
- భారత ప్రజలకే అంకితం
- ద్వైపాక్షిక బంధాలకు గుర్తింపు

జకార్తా, జులై 7: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ' ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నానని మోదీ తెలిపారు. ఈ పురస్కారం తనకు మాత్రమే కాకుండా భారత ప్రజలందరికీ దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఇండోనేషియా ప్రజల ఆప్యాయత, అభిమానానికి ఈ పురస్కారం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భారత్--ఇండోనేషియా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక, స్నేహపూర్వక బంధాలకు ఇది గుర్తింపుగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ అత్యున్నత గౌరవాన్ని అందించిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంటోకు, ఆ దేశ ప్రభుత్వానికి, ప్రజలకు మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భారత్, ఇండోనేషియా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, రక్షణ, సాంస్కృతిక రంగాల్లో సహకారం నిరంతరం విస్తరిస్తోందని మోదీ పేర్కొన్నారు. పరస్పర విశ్వాసంతో ఈ బంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, సుస్థిర అభివృద్ధికి రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## హిటాచీతో రూ.1,000 కోట్ల ఒప్పందం



- వెయ్యి మందికి ఉద్యోగాలు
- చెంగల్పట్టులో విస్తరణ ప్రాజెక్టు
- సీఎం విజయ్ సమక్షంలో ఒప్పందం

చెన్నై, జులై 7 : తమిళనాడులో పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చే మరో కీలక ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ సమక్షంలో హిటాచీ ఎనర్జీ టెక్నాలజీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించి అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో పాటు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. పోరూర్‌లో హిటాచీ ఎనర్జీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ రూ. 1,000 కోట్ల పెట్టుబడితో విస్తరణ చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు వెయ్యి మందికి ఉన్నత సాంకేతిక ఉద్యోగాలు లభించనున్నాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో సాంకేతిక రంగ అభివృద్ధికి ఈ పెట్టుబడి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. అదే సందర్భంగా చెంగల్పట్టులోని హిటాచీ ఎనర్జీ ఇండియా ఉత్పత్తి విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపైనా సంతకాలు జరిగాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలను తీర్చేలా సంస్థ విస్తరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు తమిళనాడును పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా గుర్తించడం సంతోషకరమని ఆయన అన్నారు. ఈ ఒప్పందాలతో రాష్ట్రంలో విద్యుత్, ఇంజినీరింగ్, సాంకేతిక రంగాలకు మరింత ఊతం లభిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. స్థానిక యువతకు నైపుణ్య ఆధారిత ఉద్యోగాలు పెరగడంతో పాటు అనుబంధ పరిశ్రమల అభివృద్ధికీ ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.




## విపత్తు సన్నద్ధతపై మంత్రి సమీక్ష

- ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తత
- అన్ని శాఖలకు కీలక ఆదేశాలు
- 24 గంటల సమన్వయ వ్యవస్థ
- రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి, జులై 7 : ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ముందస్తు విపత్తు నిర్వహణ చర్యలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో పోలీసు, వ్యవసాయం, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు అన్ని కీలక శాఖల ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.

## రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఆమోదం



- 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- 10,531 మందికి ఉద్యోగాలు
- పారిశ్రామికీకరణపై సీఎం దిశానిర్దేశం

అమరావతి, జులై 7 : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ. 9,076.11 కోట్ల విలువైన 11 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 10,531 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు కుటుంబాలు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశమున్నందున ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలని, దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, విమాన ఇంధనానికి సంబంధించి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగంలో రాష్ట్రానికి ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో అనుభూతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సౌర విద్యుత్ పరికరాల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో నెల్లూరు, కడప, విజయవాడ, తిరుపతి, అనకాపల్లి, బొబ్బిలి, కర్నూలు, విశాఖ, శ్రీసిటీ ప్రాంతాల్లో హోటళ్లు, వినోద కేంద్రాలు, లాజిస్టిక్స్ పార్కులు, సౌర విద్యుత్ పరికరాల తయారీ యూనిట్లు, గోల్డ్ మైనింగ్, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ పెట్టుబడులు ఆయా జిల్లాల పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి కల్పనకు దోహదపడనున్నాయి. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బాపనమ్మ అమ్మవారిని దర్శించిన మంత్రి

- పత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి
- రాష్ట్ర శ్రేయస్సుకు ప్రార్థనలు
- నేతలతో కలిసి దర్శనం

రంపచోడవరం, జులై 7: గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం రంపచోడవరం నియోజకవర్గంలోని ప్రసిద్ధ బాపనమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదిపూడి సత్తిబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి కొల్లు రవీంద్రకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ విశేషాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతుల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులతో మంత్రి ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికీ ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదిపూడి సత్తిబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు తీసుకుని ప్రసాదం స్వీకరించారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొని ప్రజలంతా ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# వ్యవసాయం సంక్షోభంలో.. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: అనంత వెంకటరామిరెడ్డి




అనంతపురం, జూలై 7 అనంత సూర్య: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండేళ్లుగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవు-తున్నాయని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సుమారు రూ. 120 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు ఉన్నాయని, రైతులు ప్రీమియం చెల్లించినా బీమా పరిహారం అందలేదని విమర్శించారు. జిల్లాలో సాధారణంగా 8.65 లక్షల ఎకరాల్లో సాగు జరిగే ఖరీఫ్‌లో ఇప్పటివరకు కేవలం 1.38 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగిందని, 7.10 లక్షల ఎకరాలు బీడుగా ఉన్నాయని తెలిపారు. విత్తన వేరుశనగ, ఎరువుల సరఫరాలోనూ తీవ్ర కొరత ఉందని పేర్కొన్నారు. హంద్రీ--నీవా ద్వారా 52 టీఎంసీల నీరు తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సాగుకు ఎంత మేర ఉపయోగపడిందో సమీక్షించాలని డిమాండ్ చేశా-రు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో సాగు, తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. రెండేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 160 మంది, అనంతపురం జిల్లాలో 75 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం కూడా అందలేదని ఆరోపించారు. ప్రస్తుత ఖరీఫ్‌కు రైతుల తరఫున ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించి వారికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే రైతులు, రైతు కూలీలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వెన్నం శివారెడ్డి పాల్గొన్నారు.

# చిన్నారి రిత్విక కుటుంబానికి స్వర్ణకార సంఘాల ఆర్థిక సాయం



అనంతపురం, జులై 7 అనంత సూర్య : నాలుగేళ్లు కూడా నిండని తన కూతురు రిత్విక హత్యకు గురైన బాధను తట్టుకోలేక అనారోగ్యానికి గురైన రామాచారిని విశ్వకర్మ పంచవృత్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు వీబీ భాస్కర్ బాబు, స్వర్ణకార కార్మిక, వర్తకులు పరామర్శించారు. పులివెందులలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న రామాచారి కుటుంబానికి మంగళవారం భాస్కర్ బాబుతోపాటు స్థానిక స్వర్ణకార కార్మిక, వర్తక సంఘాల నాయకులు రూ. 50 వేల ఆర్థిక సహా-యాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ బాబు మాట్లాడుతూ.. కూతురు మరణాన్ని జీర్ణించుకోలేక రామాచారి అనారోగ్యానికి గురికావడం బాధాకరమన్నారు. చిన్నారి రిత్వికను పొట్టనబెట్టుకున్న నిందితురాలు స్వాతికి కఠినమైన ఉరిశిక్ష పడేలా యావత్ రాష్ట్ర ప్రజల తరపున న్యాయపోరాటం చేస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పులివెందుల స్వర్ణకార సంఘం అధ్యక్షులు నూరుల్లా మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా రామాచారి కుటుంబానికి ఎలాంటి అవసరమొచ్చినా తామంతా ముందుంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు సనత్ కుమార్ ఆచారి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులంతా ఈ కుటుంబానికి అండగా ఉంటారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా స్వర్ణకార సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ.. తమ సంఘం తరపున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక స్వర్ణకార సంఘ నాయకులు ప్రకాష్ ఆచారి, బొల్లు రవి, అమానుల్లా, కృష్ణమాచారి, షబ్బీర్, ఈశ్వరయ్య, ఖాదర్, మహేష్ ఆచారి, లోకేష్ ఆచారి, షాకీర్, పలువురు స్వర్ణకార కార్మికులు, వర్తకులు పాల్గొన్నారు.

# గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన : జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



అనంత కలెక్టరేట్ జూలై 07 (అనంత సూర్య): జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఆనంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వివరాలనుసమావేశంలో తెలియజేశారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలలో బిఎల్ఏ లనుఎక్కువమందినినియమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అందించిన ఎన్యుమరేషన్ దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 14 లోగా గడువు ముగుస్తున్నందున ఆయా బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని ఓటర్లను జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నా మని అన్ని ప్రాంతాలలో బి ఎల్ ఓ, అధికారులు ఇంటింటికి వెళ్లి వంద శాతంఓటర్లకు దరఖాస్తులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బిఎల్వోలు ఇళ్లకు వచ్చినప్పుడు ఓటర్లు సరైన వివరాలు అందించి సహకరించాలని కోరారు అలాగే ఓటర్ల జాబితా పారదర్శకత కోసం రాజకీయ పార్టీలు కూడా తమ బిఎల్ ద్వారా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 59. 85% ఎస్ఐఆర్ ప్రక్రియ పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలినప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 20 ,38, 5 2 7 ఓటర్లకు గాను మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు 12 ,22, 0 0 6 9 మంది కి దాకా డిజిటలేషన్ ప్రక్రియ నమోదు జరిగిందన్నారు. ప్రతిరోజు సుమారు 1,20,000 వేల మందికి దాకా డిజిటలైజేషన్ జరుగుతుందని రాబోయే శని, ఆదివారాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఇంటింటకీ వెళ్లి ఓటర్ల వద్దనుండి విషయసేకరణ ఫారాలను స్వీకరించడం జరుగుతుందన్నారు.

80 శాతం పూర్తయిన బిఎల్వోలు సంబంధిత బి ఎల్ ఎ లతో సమావేశం చేసుకొని వారి సమన్వయంతోఇప్పటివరకు స్వీకరించబడని ఫారాలను త్వరగా స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా 2022 ఓటర్లు జాబితా వివరాలు తప్పనిసరి కాదని ఓటరు ప్రస్తుతం ఉన్నవివరాలు వ్రాసి ఆయా బిఎల్ఓ లకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువులోగా ఫారాలు సమర్పించనియెడల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అనంతపురం అర్బన్ లో 45. 22 శాతం, కళ్యాణ్ దుర్గం 67. 37, రాయదుర్గం 65. 53, గుంత కల్ 65. 36, తాడిపత్రి 60 .62, ఉరవకొండ 58. 69, సింగనమల 58. 60, రాప్తాడు 58. 85 కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 59.85% డిజిటల్ ప్రక్రియ జరిగిందన్నారు. నిర్ణీత గడువు సమీపిస్తున్నందున ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను 100% పూర్తిచేసే విధంగా తమ వంతు సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ కనకరాజు, శ్యాముల్ బెంజిమెన్, తెలుగుదేశం ప్రతినిధి నారాయణస్వామి బిజెపి పరిధినిది ఈశ్వర్ ప్రసాద్ జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్ వైయస్సార్సీపీ ప్రతినిధి సోమశేఖర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రూ.20 వేల జరిమానా

పుట్టపర్తి, జూలై 7 అనంత సూర్య : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఓ ఆటో డ్రైవర్, ఓ ద్విచక్ర వాహనదారుడికి పుట్టపర్తి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 20 వేల జరిమానా విధించినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ యువరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బ్రెత్ అనలైజర్ పరీక్షలో ఇద్దరూ మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయ-స్థానం ఇద్దరికీ రూ. 10 వేల చొప్పున జరిమానా విధించింది. ఈ సందర్భంగా సీఐ యువరాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పారాదీప్ తీరంలో చిక్కుకున్న ఏపీ మత్స్యకారులు క్షేమం.



పారాదీప్ : (జులై 7 అనంత సూర్య) ఒడిశా రాష్ట్రం సరిహద్దు లోని పారాదీప్ సముద్రంలో ఇంజిన్ సాంకేతిక లోపంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మత్స్యకారుల బోటు నిలిచిపోయి ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకుంది. బోటులో ఉన్న పది మంది ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు క్షేమంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తమైన ఒడిశా ప్రభుత్వం మత్స్యకారులను రక్షించేందుకు చర్యలు చేపట్టింది. తీరంలోని రక్షక దళం, సముద్ర పోలీసులు, మత్స్యశాఖ సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టి మత్స్యకారులను సురక్షితంగా కాపాడారు. రక్షించిన పది మంది మత్స్యకారులను పారాదీప్ నుంచి విశాఖపట్నానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మత్స్యకారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన అనంతరం వారిని స్వ-స్థలాలకు పంపేందుకు చర్యలు చేపట్టనున్నారు.

# వేలాదిమంది మున్సిపల్ కార్మికులతో దద్దరిల్లిన విజయవాడ ధర్నా చౌక్..




విజయవాడ జులై 07 (అనంత సూర్య) : ఛలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 5వేల మంది కార్మికులు ఎపి రాజధాని చేరుకున్నారు. విజయవాడ నగరం ధర్నా చౌక్ వద్ద కార్మికులు ఎరుపు జెండాలతో పోటెక్కడంతో కార్మిక సంఘాల నాయకులు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఎట్టకేలకు పోలీసు అధికారులు అసిస్టెంట్ సిడిఎమ్ఎను ధర్నా స్థలానికి పిలిపించడంతో కార్మిక సంఘాల నాయకులు మున్సిపల్ కార్మికుల డిమాండ్లను వారికి అందజేశారు. కార్మికుల న్యాయ-మైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా సిపిఐ అనుబంధం ఎపి మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి పేరుకు పోయాయని దీంతో వారి కుటుంబాల పరిస్థితి అగమ్య గొచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు నేపథ్యంలో వెనక బడిన ప్రాంతాలు అనంతపురం, గుంతకల్,కళ్యాణదుర్గం పట్టణాల్లో జనాభా కనుగొనంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి ఒకటే వేతనం 36వేల రూపాయలు జీతం ఇవ్వాలన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని,మరణించిన రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. స్కూల్ స్వీపర్ వాచ్మెన్లను ఫుల్ టైం కంటెంట్ వర్కర్స్ గా గుర్తించి 16 వేల రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ రంగాన్ని థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లకు అప్పజెప్పే 975,673 జీవోలను రద్దు చేయాలన్నారు. పిఎఫ్,ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ శివకృష్ణ, జిల్లా నాయకులు వేణుగోపాల్, కొండయ్య,వెంకటేష్,తిరుమలయ్య,రఫీ,వాసు,నాగరాజ్, ఇషాక్,దేవమ్మ,కాంతమ్మ,సుజాత,ఇందిరమ్మ,తిప్పమ్మ,ప్పఎర్రపా,కళావతి,రసూల్ బి, రవి, రాజు, తిమప్ప, సతీష్,తదితరులు పాల్గొన్నారు..

# టీటీడీ బోర్డ్ సభ్యులు భానుప్రకాష్ రెడ్డిని కలసిన బీజేపీ మల్లారెడ్డి



రాయలసీమ రాజకీయ ఋషి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ తొలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దేవీరెడ్డి సూర్యప్రకాశ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని తిర-ుమల తిరుపతి దేవస్థానం (ఋణ) బోర్డు సభ్యులు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి గారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి నగరంలో బీజేపీ జిల్లా నాయకులు, సర్ జిల్లా కన్వీనర్, కళ్యాణదుర్గం వాసి బంగారు మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా భాను ప్రకాష్ రెడ్డి అన్న ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాయలసీమ రాజకీయ ఋషి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ తొలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దేవీరెడ్డి సూర్యప్రకాశ్ వారి జీవిత చరిత్ర పుస్తకాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ రెడ్డి కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారు మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు..

## విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలిఎంఈఓకు విద్యార్థి సంఘాల వినతి



హిందూపురం, జూలై 7 అనంత సూర్య: హిందూపురం పట్టణంలోని ముదిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థినిపై ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణల ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు తేలితే బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ, ఘటనపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని, కేసులో ఎలాంటి జోక్యాలకు తావివ్వకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలల రక్షణ చర్యలను మరింత పటిష్ఠం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నాగేంద్ర, బద్రీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఏర్పాట్లను సమీక్షించిన డీఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి, జూలై 7 అనంత సూర్య : స్థానిక శ్రీ సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కొండయ్య మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థుల కోసం ఏపీఎస్ఆర్టీసీ ద్వారా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ నెల 8న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో, 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై కదిరి పోలీసులకు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు



కదిరి, జూలై 7 అనంత సూర్య: సినీ నటుడు ప్రకాశ్ రాజ్పై బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం కదిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రకాశ్ రాజ్ రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేస్తూ, హిందువులు, శ్రీరాముడు, దేవాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, నరేంద్ర మోదీ, నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌పై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ప్రకాశ్ రాజ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నారాయణ, సీపీఎం నాయకత్వం మద్దతు ఇవ్వడాన్ని కూడా ఆయన విమర్శించారు. హిందూ సమాజం, దేవాలయాలు, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తులకు ఎందుకు మద్దతు ఇస్తున్నారని ఆయా పార్టీలను ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్‌పై నమోదైన ఫిర్యాదుపై పోలీసులు చట్టప్రకారం దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు.

## అవాస్ ప్లస్ సర్వేను జూలై 10లోగా పూర్తి చేయాలి

**♦ గ్రామసభల ద్వారా అర్హుల జాబితా ఖరారు: జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

పుట్టపర్తి, జూలై 7 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో అవాస్ ప్లస్ సర్వేను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల జాబితాను గ్రామసభల ద్వారా ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 448 గ్రామపంచాయతీల పరిధిలో 58,135 మంది ఇంటి స్థలం/ఇంటి కోసం అవాస్ ప్లస్ సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ లబ్ధిదారుల అర్హతలను నిర్ధారించేందుకు జూలై 1 నుంచి 11 వరకు అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామసభల్లో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ప్రజాప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సమక్షంలో అర్హులు, అనర్హులను గుర్తించి తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించి, అవాస్ ప్లస్ సర్వేను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి తెలిపారు.

# సర్ గడువు పెంచాలి

**– ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారు**

**– ఓటరు నమోదుకు 2002 ప్రామాణికంగా తీసుకోవడాన్ని ఉపసంహరించాలి**

**– సర్ ప్రక్రియను గ్రామసభలు, వార్డు సభల ద్వారా చేపట్టాలి**

**– యునైటెడ్ జేఏసీ కన్వీనర్ జాఫర్**

**– మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్**



అనంతపురం, జులై 7 అనంత సూర్య : కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ దేశ పౌరుడు తన ఓటు హక్కును నిరూపించుకోవాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొని ఉందని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జాఫర్, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ లు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎన్నికల కమిషన్ 16 రాష్ట్రాలు మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో మూడవ విడత నోటిఫికేషన్ ద్వారా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. గతంలో ప్రకటించిన రెండు నోటిఫికేషన్ల ద్వారా ఆరు రాష్ట్రాలలో జరిగిన ఈ ప్రక్రియ తో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఆరు రాష్ట్రాలలో ఆరు కోట్ల 50 లక్షల ఓటర్లను పూర్తిగా తొలగించారని తెలిపారు. ఓటర్ల సవరణ కార్యక్రమం 1951 నుంచి ప్రతి 20 సంవత్సరాలకి ఒకసారి జరుగుతోందన్నారు. కానీ స్వయం ప్రతిపత్తిగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ పెద్దల నిర్ణయాలతో తన వ్యవహార శైలిని నడుపుతోందని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనివల్ల దేశ పౌరులు తమ స్వతంత్ర ప్రతిపత్తి అయిన ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితికి తీసుకువచ్చారన్నారు. ఇటీవల ప్రకటించిన మూడవ విడత సర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్లలో అదేవిధంగా దేశ పౌరులలో అనేక సందిగ్ధం నెలకొని ఉందని, దానిని నివృత్తి చేసే కనీస వ్యవహారాన్ని కూడా నడిపించకుండా కేవలం ప్రజలను ఓటర్లను మభ్యపెట్టేందుకు ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రధానంగా ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా కోట్ల ఓటర్లను తొలగించారని వార్తలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయన్నారు. అదేవిధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి 100 శాతం తాము ఎన్యుమరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేశామని చెబుతున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమని, తాము విచారించిన ప్రతి చోట కూడా తమకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదనే సమాధానం లభిస్తోందని తెలిపారు. కనీసం దీనిపై సమగ్ర విచారణ చేసి పరిశీలించాల్సిన ఉన్నతాధికారులు కేవలం సాయంత్రం సమయంలో నివేదికలను అందిస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో వాటి వివరాలు నమోదు పూర్తిగా వెనుకబాటుకు గురవుతోందని తెలియజేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత పార్టీలకు సంబంధించిన వారి వద్దనే ఉంచుకొని 100శాతం అందించారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయన్నారు. ఇలాంటి అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో యునైటెడ్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి జరుగుతున్న ఎసఐఆర్ ప్రక్రియకు సంబంధించి లోటుపాట్లను సరిదిద్దేందుకు ప్రత్యేక కార్యచరణను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యవహారంలో 2002 ఓటరు జాబితాను ఏ విధంగా ప్రామాణికంగా చేసుకున్నారని ప్రశ్నించారు. 2002 ప్రామాణికంగా అయితే 20 సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన కార్యక్రమాన్ని 2026 ఎందుకు పెంచారని ప్రశ్నించారు. సర్ ప్రక్రియకు సంబంధించి మరో వారం రోజులలో దరఖాస్తులను పూర్తిస్థాయిలో పూర్తి చేసి అందించాలని నిబంధనలను పెట్టారని, ప్రస్తుతం ఓటర్లలో అనేకమైన అనుమానాలు సందిగ్ధం నెలకొని ఉన్న నేపథ్యంలో వాటిని ఎలా పూర్తి చేయాలని కనీస సామర్థ్యం కూడా లేని విధంగా ప్రస్తుతం పరిస్థితి కొనసాగుతోందని, దీనిని ఆధారంగా చేసుకుని ఎసఐఆర్ ప్రక్రియకు సంబంధించి మరో నెల పాటు గడువును పెంచాలని యునైటెడ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు బాషా (టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్), బాబాషా, అల్లీపీరా, జాకీర్, చాంద్ బాషా, షఫీ, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్యపై చర్యలెక్కడ ?



అనంతపురం, జులై 7 అనంత సూర్య : శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడుతుంటే ఎందుకు ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకోలేదని విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రశ్నించారు. విద్యార్థి నేతలు మంగళవారం రుద్రం పేట వద్ద బిల్డింగ్ పూర్తి కాకుండా స్కూల్ నడుపుతున్న శ్రీచైతన్య స్కూల్ వద్ద రెండో రోజు ధర్నా నిర్వహించగా.. విద్యాశాఖ అధికారి స్పందించకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి లేకపోవడంతో అక్కడ ఉన్న ఏడి మునీర్ ఖాన్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. దాదాపు మూడు గంటల పాటు శ్రీ చైతన్య విద్యాసంస్థలకు ఎటువంటి గుర్తింపు లేదని, అలాంటి విద్యా సంస్థలు కూడా చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే, విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేస్తే.. ఇక్కడ బిల్డింగ్ పనులు జరుగుతుంటే మరోపక్క తరగతులు ఎలా నిర్వహిస్తారని ఫిర్యాదు చేశామని, ఎందుకు స్పందించలేదని అధికారులు ప్రశ్నించారు. లక్షలకు లక్షల ఫీజులు వసూలు చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా, విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ఇచ్చే మామూలు మత్తులో ఊగుతున్నారన్నారు. కనీసం జిల్లా కలెక్టర్ అయిన స్పందించి జిల్లాలో అనుమతులేని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో వివిధ సంఘాల నేతలు సతీష్ చౌదరి, జయవర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రాజేష్, విజయ్, పోలా నరేష్, ప్రశాంత్, వాల్మీకి కాశి, గోవర్ధన్, యశ్వంత్, రేవంత్ తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగల్లో ఆత్మస్థైర్యం



అనంతపురం, జులై 7 అనంత సూర్య : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో మాదిగలకు ఆత్మ స్థైర్యం వచ్చిందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఇదే రోజు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61వ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బండారు శంకర్ మాట్లాడుతూ.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి నేటికి 32 సంవత్సరాలు పూర్తయిందన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య మాదిగలు ఢిల్లీ స్థాయిలో పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ఉపయోగించుకోవాలని, తద్వారా ఉన్నత ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మార్పీఎస్ వల్లనే మాదిగల్లో ఆత్మవిశ్వాసం, తప్పును ప్రశ్నించేతత్వం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యాన్ని నేర్పించిన నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా ఎన్నో సామాజిక ఉద్యమాలు నిర్వహించినందువల్ల ఇటీవల కేంద్ర ప్రభుత్వం "పద్మశ్రీ" అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గుండెజబ్బు పిల్లల కోసం జరిగిన పోరాటాల ఫలితంగానే ఆరోగ్య శ్రీ పథకం రూపుదిద్దుతుందన్నారు. వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పెన్షన్లు పెంచాలని ఉద్యమాలు నిర్వహించినందువల్ల నేడు పింఛన్లు 4 వేలకు పెరిగాయన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాల వల్లనే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, మీస్రా జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్ర, వీజుఖీ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేపీ నాగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు బాణాసి శీనా, ఎంఈఎస్ నగర అధ్యక్షులు మీసాల నాగభూషణ, సీనియర్ నాయకు కుమ్మర పామిడి లాలెప్ప, రేకులకుంట రామాంజీ, బుడగ జంగాల సంఘం నేత సిరిశాల అంజి తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు



జులై 7 అనంత సూర్య : అనంతపురం నగరంలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని త్రీ టౌన్ నూతన సీఐ కౌలుట్లయ్యకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం నగరంలోని శాంతిభద్రతల పరిస్థితి, ప్రజల భద్రత, నేరాల నియంత్రణ ఇతర అంశాల్లో మెరుగైన సేవలు అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ, ప్రజలకు భద్రత కల్పించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని.. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసింగ్ నడుస్తోందని... ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా విధులు నిర్వహించాలని సీఐ కాలుట్లయ్యకు ఎమ్మెల్యే సూచించారు.

అనంత సూర్య
తెలుగువార్త







- నెలలు గడిచిపాయే.. హడ్ హక్ కమిటీ ఉన్నట్లా.. లేనట్లా ?
- ఒక్కొక్కరితో రూ.500 చొప్పున 315 మందితో వసూలైన ఆ లెక్క మాటేంటి ?
- ఆగ్రహంలో యువ, సీనియర్ జర్నలిస్టులు
- ఈ ఆదివారమే రిలే దీక్షలకు సంఘాలకు అతీతంగా పిలుపు
- అడ్డుపడుతున్న శక్తులపై 'కలం' ఝులిపించేందుకు 'మనం' సన్నద్ధం
- ఆ 9 మంది సభ్యులతో 10న ఈసీ మీటింగ్ నిర్వహణపై అనుమానలెన్నో ?
- భద్రత కరువై భయాందోళనలో నికార్సైన జర్నలిస్టుల జీవితాలు

## అధ్యక్షా.. ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలేనా !?

**అనంతపురం, జులై 7 అనంత సూర్య :**

అధ్యక్షా.. మా బతుకులు అంతేనా. సమస్య వస్తే కాకుల్లా అందరూ కలిసి ఉండాలని అనుకుంటున్నాము. మీరు మాత్రం బాగా ఉండి ఐదు ఆరు పోస్టులతో కోకిలా వ్యవస్థను స్థాపించాలనుకుంటే ఎలా.. కరువు జిల్లా అనంతలోని జర్నలిస్టుల తలరాతలు బాగుపడాలంటే ప్రెస్ క్లబ్ ఎన్నికలే ముందున్న మార్గం. కాలం ఉందో ముగిసిందో తెలియని ఆ హడ్ హక్ కమిటీలో ఉన్నది 9 మంది. అందులో ఒకరు ఎన్నికలు నిర్వహించాలని ముందుకెళ్తే మరొకరు పట్టి లాగుతున్నారట వెనక్కు. ఇందులో వాస్తవం ఎంతుందో గానీ ఎన్నికలు నిర్వహించాల్సిన సమయం దాటి నెలలు గడిచిపోతుంది. అందువల్లే ఈ సందేహాలు అనుమానాలు కూడా అధ్యక్షా. ఆ 9 మందిలోని అధిక శాతం సభ్యులు అంతా మీదే తప్పని ఏలెత్తి చూపిస్తున్నారు. ఆ విమర్శలకు మీరే చెక్ పెట్టాలి, లేదా అందు నుండి ఎన్నికలు జరిగే వరకు తీసుకెళ్లి స్వచ్ఛందంగా తప్పుకోండి. ఇందులో మేము అధ్యక్షుడిని మాత్రమే తప్పు పట్టడం లేదు. అధ్యక్షుడిని మినహాయిస్తే మరో 8 మంది ఆ హడ్‌హక్ కమిటీలో ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రేపటి రామాంజనేయులు, కోశాధికారిగా అనిల్ కుమార్ రెడ్డి, సభ్యులుగా నాగేందర్ రెడ్డి నాగేంద్ర, లక్ష్మీ నారాయణ, కృష్ణా, కేపీ కుమార్‌లున్నారు. వీరంతా సమర్థులే పలు పత్రికలు, చానళ్లకు ప్రతినిధులే. అయితే అధ్యక్షుడు ఒక్కడు లేకపోతే వీరు ఎన్నికలు నిర్వహించలేరా? మెజార్టీ సభ్యుల కింద ఓ మారు అధ్యక్షునికి గుర్తుచేసి ఎన్నికల వైపుకు నడిపించలేరా, వీరంతా తలుచుకుంటే ఆ ఎన్నికల నిర్వహణ ఏపాటిదని ఎందరో యువ, సీనియర్ జర్నలిస్టులు తమ మదిలోని మాటను తెలియజేస్తున్నారు. ఒక్కొక్కరితో 500 చొప్పున 315 మందితో రూ,1.57 లక్షలు ఎక్కడ ? ప్రెస్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహిస్తామని, అర్హులైన జర్నలిస్టులు అందరితోనూ సభ్యత్వానికి 500 రూపాయలు చొప్పున 315 మందితో అక్షరాల 1,57, 500 వసూళ్లు కాబడ్డాయట. మరి ఆ లెక్క అంతా ఎక్కడుంది? ఈ ఎన్నికల కోసం ఏర్పాటు చేయబడ్డ వాట్సాప్ గ్రూప్ కూడా లేకుండా పోయింది. ఆ గ్రూపు ఉన్న కారణంగానే గతంలో పలువురు జర్నలిస్టులను ఆదుకోవడం కూడా జరిగింది. ఈ విషయం సభ్యులైన ప్రతి ఒక్కరికి తెలుసు. అయితే వాటన్నింటినీ పక్కనపెట్టి ప్రశ్నించడం మానేసి ప్రెస్‌క్లబ్ ప్రక్షాళన బతుకులు మార్చుకుందామని ఎందరో జర్నలిస్టులు భావిస్తున్నారు.



ఈ ఆదివారమే రిలే దీక్షలకు సంఘాలకతీతంగా యువ సీనియర్ జర్నలిస్టుల పిలుపు అనంతలో అభద్రత నడుమ జీవిస్తున్న నికార్స్ అయినా జర్నలిస్టుల భద్రతే లక్ష్యంగా ఈ ఆదివారమే రిలే నిరాహార దీక్షలకు పిలుపునిస్తున్నట్లు పలువురు యువ జర్నలిస్టులు తెలియజేస్తున్నారు. అయితే అది కూడా ఈనెల 10న ప్రెస్ క్లబ్ ఈసీ మీటింగ్ నిర్వహణ సజావుగా జరిగి ఎన్నికల వైపుగా ముందుకెళ్తే సమస్య లేదని కాదని మళ్లీమళ్లీ నెలలు తరబడి కాలయాపన చేస్తామంటే మాత్రం రిలే నిరాహార దీక్షల నుండి ఆవరణ దీక్షలో కూడా పోతామని ఈ ఎన్నికలను అడ్డుకునే శక్తులను హెచ్చరిస్తున్నారు. మరి హడ్‌హక్ కమిటీ సభ్యులు ఏ నిర్ణయం తీసుకుంటారో, మీడియా యాక్ట్ ప్రకారం, కాస్త సడలించైనా అర్హులైన జర్నలిస్టులకు సభ్యత్వం కల్పించి ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తారో వేచి చూడాల్సి ఉంది.

## ప్రతి యూనిట్ లోను పార్టీ సమావేశాలు నిర్వహించాలి

**యూనిట్ ఇన్ ఛార్జ్ లకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం**
**ఎస్ఐఆర్ విషయంలో మరింత చురుగ్గా పనిచేయాలని సూచన**
**అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, తీర్మానాలు చేయాలన్న ఎమ్మెల్యే సునీత**



అనంతపురం, జూలై 7 అనంత సూర్య : రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని 6మండలాల్లోని 59మంది యూనిట్ ఇన్ ఛార్జ్ లు తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి రేపు బుధవారం యూనిట్ ఇన్ ఛార్జ్ ల సమావేశం నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని.. ఆ మేరకు నియోజకవర్గ పరిధిలోని 59యూనిట్లలోనూ సమావేశాలు జరగాలన్నారు. పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలను కలుపుకొని సమావేశాలు నిర్వహించి.. మీ పోలింగ్ బూత్, గ్రామ, యూనిట్ స్థాయిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలి, సమస్యలు ఏమైనా ఉన్నాయా? వంటి వాటి మీద చర్చించాలన్నారు. అలాగే పనులు చేపట్టాల్సిన అంశాలపై తీర్మానాలు చేసి మై టిడిపి యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. బీఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫామ్ లు బిఎల్ఓలకు అందజేసేలా చూడాలన్నారు. కొన్నిచోట్ల అవగాహన లేక ప్రజలు వీటికి దూరంగా ఉంటున్నారని.. అయితే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మన పార్టీపై ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు. మరోసారి బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్, మండల ఇన్చార్జ్ లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

## ఎస్ఐఆర్ పై అనవసర అపోహలు సృష్టిస్తున్నారు :ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, జూలై 7 అనంత సూర్య : ఎస్ఐఆర్ పై కొందరు అనవసర అపోహలు సృష్టిస్తున్నారని.. తమకు ఓటు హక్కు పోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. నగరంలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పర్యటించారు. నగరంలోని మారుతి నగర్, అశోక్ నగర్, బుడ్డప్ప నగర్, సంగమేష్ నగర్, ఎర్ర నేల కొట్టాల ప్రాంతాలలో పర్యటించి, ఎస్ఐఆర్ పై బిఎల్ఓలు, బిఎల్ఎ లతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కొన్ని సందేహాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా ఎస్ఐఆర్ కి సంబంధించిన ఎన్యుమరేషన్ ఫార్మ్స్ ప్రజలకు అందజేశారని.. వాటిలో పూర్తిస్థాయి వివరాలతో తిరిగి బీఎల్ఓ లకు ఇవ్వాలని సూచించారు. అయితే కొంతమందికి దీనిపై అవగాహన లేక ఆందోళన చెందుతున్నారన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. రాజకీయాలకు ఎక్కడా సంబంధం లేదన్నారు. తమ ఓటు హక్కు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 2002 ప్రామాణికంగా ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతోందన్నారు. అప్పటి వివరాలు లేకపోతే ప్రభుత్వం నిర్దేశించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏవైనా రెండు చూపితే సరిపోతుందని చెప్పారు. వృద్ధులు, చదువు రాని వారికి మా పార్టీ బిఎల్ఏలు సహకరిస్తున్నారని చెప్పారు. కొత్తగా ఓటు హక్కు పొందాలనుకునే వారికి కూడా ఇది మంచి అవకాశం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ గత నెల రోజులుగా ఈ కార్యక్రమంపై సీరియస్ గా పని చేస్తున్నారని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా ఇది పురోగతి లేకపోతే అప్రమత్తం చేస్తున్నారని వివరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం 100 శాతం పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ లు సరిపూటి రమణ, రాజారావు, సాకె లక్ష్మీనరసింహ, కృష్ణం రఘు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, టిడిపి నాయకులు జోగి రాజేంద్ర, సరిపూటి శ్రీకాంత్, ఇమ్రాన్, పుల్లన్న, సరోజమ్మ, యమున, కట్టుబడి బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

## మండల గ్రామాలలో పి ఎం డి ఎస్ డెమోల విత్తనాల విత్తే నిర్వహణ

**14 - రకాల వంటి విత్తనాలను బంకమట్టి బూడిద తో- బీజామృతం**
**ఘన జీవామృతం వంటి మిశ్రాలతో గుళికలు వేసుకుని విత్తనాల విత్తండి -**
**రైతులకు వ్యవసాయ అధికారి సూచనలు**



ముదిగుబ్బ,జులై 7, అనంత సూర్య: ముదిగుబ్బ మండలంలోని సంకేపల్లి గ్రామంలో పిఎండిఎస్ డెమో ల ముదిగుబ్బ మండల వ్యవసాయ అధికారి మరియు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వీరి ఆధ్వర్యంలో మంగళవారం డెమోల కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి రవీంద్ర మాట్లాడుతూ(14) రకాల విత్తనాలను గుళికలు విత్తడం జరిగినది అని తెలిపారు( కంది ఆముదం అలసంద అనుములు పెసర) వంటి విత్తనాలను బంక మట్టి బూడిద తో ( బీజామృతం ఘన జీవామృతం ) వంటి మిశ్రాల తోగుళికలు వే-సుకుని విత్తనాలు విత్తడం ద్వారా తక్కువ వర్షపాతంతో విత్తనాలు మొలకెత్తుతాయని ముదిగుబ్బ మండల వ్యవసాయ అధికారి పి రవీంద్ర రైతులకు తెలియజేశారు ఎల్ ని నో పరిస్థితుల దృష్ట్యా బీడు భూములలో రైతులందరూ ఈ పద్ధతి ద్వారా పంటలు సాగు చేసుకో వచ్చునని మండల వ్యవసాయ అధికారి రైతులకు తెలియజేశారు మండలంలోని ప్రతి ఆర్ ఎస్ కె పరిధిలో-5- మంది రైతుల పొలాల్లో పీఎండిఎస్ డెమోల ఈనెల(7-8-9) తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు మంగళవారం సంకేపల్లి లోని నిర్వహించిన పీఎండిఎస్ డెమో కు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ ఖాజావలి మండల వ్యవసాయ అధికారి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆశ ప్రియాంక షామీర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## దళితుల భూములు దళితులకే చెందాలి

**పోలికి లక్ష్మమ్మ పొలం అక్రమంగా కబ్జా చేసిన ఇక్కలూరి సుబ్బిరెడ్డి పై చర్యలు తీసుకోవాలి**



గార్లదిన్నె,జులై07,అనంత సూర్య:గార్లదిన్నె మండలం కోటంక గ్రామం దళిత రైతు పోలికి లక్ష్మమ్మ భూమి సమస్య పై బండారు కుళ్లాయప్ప ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబరు మరియు దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్ వెళ్లి ఆమె పొలంను సందర్శించినారు.సర్వేనెంబర్ 101-3ఎ లో 2ఎకరాముల పొలంను గత 50 సంవత్సరాలుగా సాగుచేసుకొని జీవనం కొనసాగిస్తూ ఉన్నారు కానీ అదే సర్వే నంబర్ లో గల రైతు సుబ్బిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి వీరు పోలికి లక్ష్మమ్మ పొలం చుట్టూ ప్రహరీ గోడ కట్టి భూమిని ఆక్రమించుకోవడం జరిగింది. ఈ విషయంపై లక్ష్మమ్మ కొడుకులు అతని దగ్గర చాలాసార్లు మా పొలం మాకు వదలండి మీ పొలం కి హద్దుకు వేసుకొండి అని చెప్పిన వారు వినకుండా కులం పేరుతో దుర్భాషలాడి దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ వీరిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఉన్నారు. ఇదే విషయం పై దళిత సంఘం నాయకులు కలిసి గార్లదిన్నె ఎస్ఐ అర్జీ ఇవ్వడం జరిగింది నాయకులు మాట్లాడుతూ దళిత రైతు లక్ష్మమ్మ పొలంను ప్రభుత్వం వారు రికార్డు పరంగా కబ్జాకు గురైన భూమిని విడిపించి ఆమెకు న్యాయం చేసి, కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల సాధన సమితి వ్యవస్థాపకులు మీనుగా గోపాల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బండారు కుల్లాయప్ప, మరియు చికలగురికి మరెన్న,షేక్షనిపల్లి రమేష్,రేగటి భీమా, ప్రసాద్ నాయక్, ఎర్రిస్వామి, సూర్యం,అంజి కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి: ఓబిరెడ్డి

గార్లదిన్నె,జులై07,అనంత సూర్య:ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను అనుసంధానం చేసుకోవాలని వైయస్సార్సీపి నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఓబిరెడ్డి పిలుపునిచ్చారు.బుక్కరాయసముద్రం మరియు నార్పల , గార్లదిన్నె మండలాల్లో పర్యటించిన ఆయన,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామా మార్పులు మరియు ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి, తమ ఓటు హక్కును ధృవీకరించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, ఫణిందర్ సుంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఓటర్లందరికీ అవగాహన కల్పించడంలో పార్టీ శ్రేణులు చురుగ్గా వ్యవహరించాలని, బిఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405